# గది

- మాడుగుల కృష్ణకుమారి



"మీ పద్ధతి నాకేం నచ్చటం లేదు సుమా. రాను రాను మరీ కుర్రాడయిపోతున్నారు. అందరికీ వయస్సు ముందుకు నడుస్తుంటే, మీకు మాత్రం వెనక్కు పరుగెడుతూన్నట్లుంది. అర డజను మంది సంతానం, ఓ పదిమంది మనవలు, మనవరాళ్ళు వున్నారని మర్చిపోకండి.

హవ్వ, ఎవరన్నా వింటే నవ్విపోతారు.

పట్ట పగలు, మిట్ట మధ్యాహ్నం, అదీ వంట గదిలో ఎవరయినా చూస్తారు అనయినా లేకుండా, వెనకనుంచి వచ్చి నన్ను వాటేసుకుంటారా?

మొన్నటికి మొన్న బాత్ రూమ్‌లో కూర్చుని చన్నీళ్ళు కావాలన్న నెపంతో పిల్చి లోపలకు రాగానే గడియ వేస్తారా?

కోడళ్ళ ముందు నా ప్రాణం సిగ్గుతో చచ్చిపోయిందంటే నమ్మండి. ఇప్పటికిప్పుడు గుడి పేరు చెప్పి ఈ హొటలుకి తీసుకువస్తారా? ఎవరైనా చూస్తే బాగుంటుందా?

మధ్యాహ్నం నుంచి కడుపులో వున్న అక్కసంతా భర్త ముందర వెళ్ళ గక్కింది సరస్వతమ్మ

"ఏం, మాట్లాడరే, ఆ టైమ్‌కి పెద్ద కోడలు వచ్చింది కాబట్టి సరిపోయింది, అదే చిన్న కోడలయితే నానా అల్లరి చేసేది. ఓసారి, మీరు నా బుగ్గన చిటకెయ్యడం చూసిందిట. అందరికీ చెప్పింది."

"నేనా, ఎప్పుడో గుర్తు లేదే" అన్నాడు మన్మథం భార్యవైపు నవ్వుతూ చూస్తూ.

"ఆ, ఎప్పుడో ఓసారయితే గుర్తుంటుంది. ఎప్పుడూ అదే రంధాయే మీకు. ఎవరన్నా చూస్తారని వుండా ఏమన్నానా? మీ చూపులన్నీ నామీదనేగా. అయినా కొంత వయసొచ్చాక యివన్నీ తగ్గించుకోవాలి."

భార్య చెప్పిందంతా విని, "అసలు ఈ తప్పంతా నాదేనోయి " అన్నారాయన భార్యవైపు చూస్తూ.

ఆవిడ తెల్లబోతూ - "నాదా! అంటే ఈ చేష్టలన్నీ నేను చెయ్యమంటున్నానా?" అంది.

"లేకపోతే ఇంత వయసొచ్చినా ఇంత అందంగా ఎవరుండమన్నారు చెప్పు? ఈరోజు మన పెళ్ళిరోజు కదా. ఉదయం నుంచి ఒక్కసారన్నా నా ముఖం చూసావా? కనీసం నీ చేత్తో కాఫీ అయినా యిచ్చావా? ఎంతసేపు ఆ వంటగది తప్ప. మరి నాకెలా వుంటుంది. అందుకే పెళ్ళిరోజు కానుకగా ఓ ముద్దిచ్చాను. ఎన్నాళ్ళయిందో మనం యిలా కూర్చుని మాట్లాడుకుని. అందుకే ఈ హొటలుకి తీసుకువచ్చాను. ఈ మాత్రందానికే అంత హడావుడి చేస్తావెందుకు వాళ్లు చూస్తారు, వీళ్ళు చూస్తారు అని. చూస్తే చూస్తారు. ఏమిటట. ఈ వయసులో కూడా అన్యోన్యంగా వున్నాం అని సంతోషిస్తారు."

"ఆ, సంతోషించటం కాదు. అందరికీ టాంటాం చేస్తారు. వయసు పెరిగినా వీళ్ళకి ధ్యాస మాత్రం తరగ లేదని. అయినా, పెళ్ళి రోజు పేరంటాలు చేసుకునేందుకు మనమేమన్నా చిన్న వాళ్ళమా" అందావిడ.

"అబ్బా! ఒంటరిగా వున్నా ఈ గొడవేనా. కాస్త సరదాగా కబుర్లు చెప్పవూ" అన్నాడాయన భార్యని ప్రేమగా దగ్గరకు తీసుకుంటూ.

"ఇక్కడ నా రామాయణం సాగుతూనే వుంది, మీరు మీ భాగోతం మొదలు పెట్టారన్న మాట. నడవండి" అందావిడ ఆయన్నుంచి దూరంగా జరిగి.

అయిష్టంగానే లేచారాయన.

☆ ☆ ☆

వెళ్ళేటప్పుడు అత్తగారి తల్లో లేని పూలు, మామగారి నోట్లో కిళ్ళీ చూసి గుసగుసలాడుకున్నారు కోడళ్ళు.

"మీ నాన్నగారే నయం పెళ్ళిరోజు అని అత్తగార్కి హొటల్లో డిన్నరిచ్చారు. మీరూ వున్నారు. ఎందుకు?" భర్తను దెప్పిపొడిచింది పెద్ద కోడలు హేమ.

"ఎవరు చెప్పారు నీకు" అన్నాడు భర్త.

"పెద్ద మరిది స్నేహితుడు చూసి, మరిదితో చెపితే, అతను భార్యతో చెపితే, ఆమె నాతో, నేను మీతో" అంది.

"మా నాన్నింకా తాను కుర్రాడిని అనుకుంటున్నాడల్లే వుందిలే."

"మహానుభావుడు ఈ వయస్సులోనే యిలా వుంటే, వయసులో వుండేటప్పుడు ఎలా వుండేవాడో?" అంది ఆలోచనగా హేమ.

"సర్లే! ఆ గొడవ మాని లైటార్పు" విసుక్కున్నాడు భాస్కరం.

☆ ☆ ☆

మన్మథం గారి కుటుంబం గృహప్రవేశం అయి మూడురోజులు అయింది. కొత్త యింట్లో సామాన్లు సర్దే గొడవలో కోడళ్ళకి అండదండగా వుంది సరస్వతమ్మ

మధ్యాహ్నం భోజనాలు పూర్తయినాయి.

ఇంట్లోని వాళ్ళందర్నీ హాల్లో సమావేశపర్చాడు, ఆ ఇంటి పెద్ద మన్మథం.

"చూడండి పిల్లలూ! ఎంతో కాలంగా ఇల్లు కట్టాలి అనుకున్నా, కానీ కుదర్లేదు. ఎదుగు బొదుగు లేని ఉద్యోగంతో రిటైరయ్యాను. మీ అమ్మకి వాళ్ళ పుట్టింటి వాళ్ళిచ్చిన సొమ్ము ఎప్పుడో బ్యాంకులో వేస్తే, అది ఇన్నాళ్ళకు పిల్లల్ని పెట్టి, పెరిగి పెద్దయి ఇదిగో ఈ ఇల్లు అమరేలా చూసింది. మీ అందరికీ తెల్సు. ఇన్నాళ్ళు అద్దె కొంపలో, ఇరుకు గదుల్లో మీరు, వంట గదిలో మీ అమ్మ, వరండాలో నేను ఎలాగో అలా కాలక్షేపం చేశాం. ఇప్పుడు సొంత ఇంట్లో అయినా సుఖపడాలి. అందుకే మీకందరికీ చెప్పేదేమిటంటే ఆ దక్షిణంవైపు బెడ్‌రూమ్ నాకు కావాలి. మిగిలిన గదులు మీ ఇష్టం" అన్నాడాయన.

'ఆ మాస్టర్ బెడ్‌రూమ్ మీకా?' అన్నట్లుగా చూశారు కొడుకులు

ముగ్గురూ.

అవును, నాకే అన్నట్లుగా చూశాడాయన.

'ఈ వయసులో మీకు గదా' అని ఒకరు.

"మీకు ప్రత్యేకంగా గది ఎందుకు నాన్నా. ఇంత యింట్లో ఎక్కడయినా వుండచ్చు. ఎక్కడయినా పడుకోవచ్చు." అని మరొకరు.

తమ తమ అభిప్రాయాలు వివరించారు.

కానీ, మన్మథంగారు ఎవరి మాటా విన్పించుకోలేదు.

లాభం లేదనుకున్న కొడుకులు తల్లి దగ్గరకు వెళ్ళారు.

సరస్వతమ్మకు తల కొట్టినట్లయింది.

"ఏమిటండీ మీరనేది. అసలు మతుండే మాట్లాడుతున్నారా. ఈ వయసులో మనకు గదా? అదీ కొడుకులతో పోటీ పడి. నాకేం నచ్చలేదు. అయినా, మనం ఎక్కడుంటే ఏం చెప్పండి?"

"ఒరేయి పిల్లలూ! మీ నాన్నగారు సరదాగా అంటున్నారు కానీ మీలో ఎవరో ఒకరు ఆ గదిని తీసుకోండి" అంది సరస్వతమ్మ

"ఆ, ఈవిడ మాటలు ముసలాయన పడనిస్తాడా? ఆయన ఆలోచనలు పడుచువాళ్ళకన్నా పదడుగుల ముందున్నాయి" అనుకున్నారు కోడళ్ళు.

"నిర్ణయం నీది కాదు సరస్వతి, నాది" అన్నాడు మన్మథం గారు స్థిరమయిన గొంతుతో.

కొడుకుల ముఖాలు మాడిపోయాయి.

ముసలాయన సామాన్యుడా అనుకున్నారు కోడళ్ళు.

మర్నాడు ఉదయం ఇంటి ముందాగిన బండిలోంచి డబుల్ కాట్ బెడ్ దిగింది.

అది సరాసరి మన్మథం గారి గదివైపు నడిచింది.

మరి కాసేపటికి ఆ గది కిటికీలకు, తలుపులకు పువ్వుల కర్టెన్స్ వెలిశాయి.

తనకేం పట్టనట్లుగా దొడ్లో తులశమ్మ దగ్గర వత్తులు చేసుకుంటూ కూర్చుంది సరస్వతమ్మ

భార్య చెయ్యి పట్టుకుని లాక్కెళ్ళి, "చూడవోయ్! ఎలా వుంది మన గది. ఈ మంచం, రా, కూర్చో" అన్నారాయన.

"ఆ, మంచం బాగానే వుంది. మీరు బాగానే వున్నారు. బాగాలేనిది ఎటొచ్చి నాకే" అందావిడ.

"మనకో మంచం వుండకూడదా. ఈ వయసులో మనం సుఖపడటం తప్పంటావా చెప్పు" అన్నారాయన.

"తప్పు కాదు కానీ, మంచం, అదీ ఈ మంచం అంత ముఖ్యం అంటారా? మీ పన్లు నాకేం అర్థం కావటం లేదు. కొడుకులు - కోడళ్ళు చూసే చూపులు తట్టుకోవటం నావల్ల కావటం లేదు సుమా."

కళ్ళ నీళ్ళు గిర్రున తిరిగాయావిడకు.

"చూడు సరస్వతి! ఇది నీ యిల్లు. ఇక్కడ నువ్వు ఎవరికీ జంకవల్సిన అవసరం లేదు. ఇదంతా నీకోసమే" అన్నారాయన అనురాగంగా.

'ఆ, నాకోసమే నేను మాటలు పడటానికే' అనుకుందామె.

☆ ☆ ☆

**ఆ** ఉదయం ఆలస్యంగా లేచిన అత్తగార్ని చూసి, కళ్ళతోనే సైగలు చేసుకున్నారు కోడళ్ళు.

"అత్తయ్యా! రాత్రి చాలా ఆలస్యంగా నిద్రపోయినట్లున్నారు" అంది పెద్ద కోడలు అత్తగారి వైపు అదోలా చూస్తూ.

"ఆ, మరే లైటు వెలగటం నేను చూశాను" అంది చిన్న కోడలు.

సమాధానం చెప్పకుండా బాత్‌రూమ్‌వైపు వెడుతున్న ఆవిడ చెవులకు - "కొత్త గది, కొత్త మంచం, మళ్ళీ వెనుకటి రోజులు గుర్తుకు వచ్చినట్లున్నాయి" అని పకపకా నవ్వుకోడం వినబడింది.

"మామగారి హుషారు చూస్తుంటే, మళ్ళీ అత్తగార్కి సీమంతం వేడుకలు చెయ్యాల్లేమో" అని కూడా నవ్వుకున్నారు కోడళ్ళు.

రోజులో చాలాసేపు ముసలాయన గది తలుపులు మూసుకుని వుండటం గమనించి,

"ఛీ, ఛీ వయసు రాగానే సరిపోదు. కాస్త ఇంగితం పెరగాలి. పదిమంది తిరిగే కొంపలో మరీ ఇలానా..."

"నేనయితే ఆత్మహత్య చేసుకునేదాన్ని" అని చిన్న కోడలు.

వాళ్ళ వేళాకోళం, వెక్కిరింతలు, అసహ్యాల మధ్య నిస్సహాయంగా చూస్తూ నిలబడిందా గది.

"ఏమిటండీ ఇది, మీరు చెప్తారా, నన్ను చెప్పమంటారా? చాలా అసహ్యంగా ప్రవర్తిస్తున్నారు వాళ్ళు" అని కోడళ్ళు ఎవరి మొగుళ్ళకి వాళ్ళు బ్రెయిన్ వాష్ చేస్తున్నారు.

'అవును, నిజమే, ఈ వయసులో నాన్న ఇలా ప్రవర్తించటం చాలా ఛండాలంగా వుంది. ఇంట్లో పెళ్ళీడుకొచ్చిన ఆడపిల్లలున్నారు. చెడిపోరూ' అనుకుని కొడుకులు, కోడళ్ళు తమ అసమ్మతిని ప్రకటిస్తూ ఆ తలుపును సామూహికంగా బాదారు.

ఇంతలో ఛళ్ళున తలుపులు తెరుచుకున్నాయి.

బయటికొచ్చిన మన్మథంగారు దండయాత్ర కొచ్చిన ప్రత్యర్థులను చూసి ఏమిటి అన్నట్లుగా ప్రశ్నించారు.

సమాధానం రాలేదు.

ఈసారి మరింత గట్టిగా అడిగారు.

ఏం చెప్పాలో తెలియక తికమకపడ్డారు కొడుకులు.

కోడళ్ళు ఒకళ్ళ ముఖాలు ఒకరు చూసుకోవటం తప్ప ఏమీ చెప్పలేక పోయారు.

"ఏమిట్రా! మా ప్రవర్తన చాలా అసహ్యంగా తోచి దానిని ప్రతిఘటించడాన్కి వచ్చారా? సిగ్గు, లజ్జా లేకుండా ఇదేమిటిలా ప్రవర్తిస్తున్నారు అని నిలదీసి అడగటాన్కి వచ్చారా? అవును ఇది మీకు చాలా అసహ్యంగా అన్పించవచ్చు. కానీ, నాకు మాత్రం చాలా అవసరం అన్పించింది. ఎందుకో తెలుసా. పుట్టి బుద్ధెరిగాక ఇంతవరకు ఏ సుఖానికి నోచుకోలేదు మీ అమ్మ. మిమ్మల్ని కని పెంచిన యంత్రంగా, మీ ఆలనా పాలనా చూసే దాదిగా, మీకు చిన్న కష్టం వస్తే తను కొండంత బాధతో కుమిలిపోయే ప్రేమమూర్తిగా, ఒక పిచ్చిదాని గానే ఇంతకాలం జీవితం గడిపింది. మీ అమ్మది విశాల హృదయం కదా అందుకే డాక్టరు హార్ట్ ఎన్‌లార్జ్‌మెంటు అని చెప్పాడు మొన్న. పూర్తిగా బెడ్ రెస్ట్ అవసరం అన్నాడు. అందుకే నాకు గది కావాలి. ఆ గదిలో మీ అమ్మనొక గాజు బొమ్మలాగా కాపాడుకోవాలి. ఆ స్వార్థంతో గది కావాలని అడిగాను. తన మది అనే గదిలో నాకు పూర్తిగా చోటిచ్చింది మీ అమ్మ. ఆమె సొమ్ముతో కట్టిన ఈ ఇంట్లో ఓ గది కేటాయించమని అడగటం తప్పా? ఆమె విశ్రాంతి కోసం తలుపులు మూస్తే, గది లోపల శృంగారం వరదలా కట్టలు తెంచుకుని ప్రవహిస్తోందని ఊహాగానాలు చేసి అందరూ దాడికి సిద్ధపడ్డారు. అవునా?

"మొన్న రాత్రంతా మీ అమ్మ గుండెల్లో ఆయాసంతో బాధపడితే దగ్గరుండి సేవ చేశాను, మీ నిద్రలకు ఆటంకం కల్గనీయకుండా. పాపం దాన్ని మరోలా అర్థం చేసుకున్నారు కోడళ్ళు.

"జీవితమంతా కష్టపడి సంపాదించినదంతా మీ కోసమే ఖర్చు చేసాను. ఏమీ మిగుల్చుకోలేకపోయాను. మీనుంచి మేము ఏమీ ఆశించింది లేదు. ఈ గది కేవలం మీ అమ్మ కోసమే. మీకు అర్థం అయిందనుకుంటాను. మా కష్టాల్లో పాలుపంచుకో లేకపోయినా విపరీతార్థాలు తీయడానికి వెరవలేదు మీరు. వెళ్ళండి. వెళ్ళి మీరు, మీ భార్యలు మూసుకుపోయిన కళ్ళు జాగ్రత్తగా తెరిచి మరీ ఆలోచించండి."

ఆయన కళ్ళల్లో పల్చటి నీటిపొర కదిలింది. 'సారీ! నాన్నగారూ. క్షమించండి' అని ముక్త కంఠంతో అందరూ అనాలనుకున్నా వాళ్ళెవరికీ గొంతు పెగల్లేదా సమయంలో.

❋ ❋ ❋

**సినిమా - సైక్లింగ్**

1938లో సిడ్నీలో జరిగిన బ్రిటిష్ ఎంపైర్ గేమ్స్‌లో భారతదేశం తరఫున సైక్లింగ్‌లో పాల్గొన్న జానకీదాస్ హిందీ సినిమాలలో మంచి పాత్రలూ ధరించి రాణించాడు.